# విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది.15-11-2017.**

## పడవమునక ప్రమాద ఘటనకు కారకులైన నిందితుల అరెస్టు

ది.12.11.17న సాయంత్రం సుమారు 5.15 గం॥లకు ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణానదిలో రివర్‌బోటింగ్ మరియు ఎడ్వంచర్స్‌కు చెందిన పడవ తిరగబడి, పడవలో ప్రయాణిస్తున్న 41 మంది ప్రయాణీకుల్లో 21 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. జరిగిన ప్రమాద ఘటన అత్యంత విషాదకరం.

బోటుమునక ప్రమాదం సమాచారం అందిన వెంటనే స్పందించిన విజయవాడ నగర పోలీస్ శాఖ సంఘటనా ప్రదేశానికి క్షణాల్లో చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొనడం జరిగింది. అలాగే మృతి చెందిన వారి వివరాలు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం, ఆలస్యం కాకుండా అర్ధరాత్రి సమయంలో పోస్టుమార్టం నిర్వహించేందుకు చర్యలు తీసుకుని మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించడంతో పాటు ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలు మరియు సమీపంలో ఉన్న పల్లెకారుల సహకారంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టడం జరిగింది.

ఈ దారుణమైన ప్రమాదానికి కారణమైన వారందరిపై విజయవాడ నగర పోలీస్ శాఖ క్రిమినల్ కేసులు నమోదు చేసి, అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టి, ఏడుగురు నిందితులైన 1) శేషం మోదా కొండలరావు, 2) నీలం శేషగిరిరావు, 3) మాచవరపు మనోజ్‌కుమార్ అలియాస్ చిట్టి, 4) వింజమూరి విజయసారథి, 5) గెదెల శ్రీను మరియు 6) బోటును నడిపిన వ్యక్తుల్లో ఒకరైన భైరవ స్వామి మరియు 7) శ్రీమతి గెదెల లక్ష్మీలను ఈ రోజు అరెస్ట్ చేయడం జరిగింది.

ఈ కేసు పూర్వాపరాలు గమనిస్తే ప్రమాదం జరిగిన పడవ శేషం మోదా కొండలరావు పేరుమీద ఏపి టూరిజం డెవలెప్‌మెంట్ కార్పోరేషన్‌తో ఒప్పంద అయ్యి ఉన్నది. ఈ సంవత్సరం జనవరి నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలో ప్రజలు, ప్రభుత్వం రంగ సంస్థల భాగస్వామ్యంతో టూరిజం డెవలెప్‌మెంట్ కార్పోరేషన్‌లో వివిధ రకాల పనులకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది. కొండల రావు తన చిన్ననాటి స్నేహితులైన గెదెల శ్రీను ఏపి టూరిజం నందు తాత్కాలిక బోటు డ్రైవర్, నీలం శేషగిరిరావు, మచిలీపట్నంకు చెందిన మాచవరపు మనోజ్‌కుమార్ అలియాస్ చిట్టి మరియు నెల్లూరుకు చెందిన వింజమూరి విజయసారథి అనే వారితో కలసి ఏపి టూరిజం శాఖతో ఒప్పందం కుదుర్చుకుని బోట్లను నడపడానికి ఆలోచన చేసిశారు. ఆ దిశగా గెదెల శ్రీను తన భార్య అయిన లక్ష్మి పేరుమీద మరియు నీలం శేషగిరిరావు, శేషంమోదా కొండలరావు పేరున రివర్‌బోటింగ్ & అడ్వంచర్స్ అనే సంస్థను ఏర్పాటు చేసి వివిధ రకాల 10 బోట్లను కృష్ణానదిలో విహార యాత్రికుల కొరకు నడపడానికి టూరిజం శాఖతో కొండలరావు పేరుమీద ఒక ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఈ ఒప్పందాన్ని అనుసరించి పలు ధఫాలుగా స్పీడు బోట్లను తీసుకువచ్చి పున్నమీ ఘాట్ నందు పెట్టి నడపడం జరిగింది. ఈ సంస్థకు శేషం మోదా కొండలరావు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించేవాడు.

*(మిగతా 2వ పేజీలో ...)*

ఈ ఒప్పందం ప్రకారం అన్నిరకాల పడవలను తీసుకుని రావడానికి 1.5 కోట్లను లెక్కవేయడం జరిగింది. ఆ దిశగా కొండలరావు పై సంస్థను చూపించి తన స్నేహితులు మరియు తెలిసిన వ్యక్తుల ద్వారా ఇందులో రూ.74.50 లక్షల మేరకు భారీగా పెట్టుబడులు పెట్టించాడు. ఇందులో టూరిజం కార్పోరేషన్‌లో పని చేసే కొల్లి శ్రీధర్ కూడా తన మామ గారి పేరున పెట్టుబడులు పెట్టి వాటాదారునిగా చేరాడు. అలాగే టూరిజం శాఖ ప్రధాన కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న పులుసు వీరారెడ్డి కూడా పెట్టుబడి పెట్టి తన కొడుకును కూడా పై సంస్థలో ఉద్యోగంలో చేర్చాడు. సదరు అగ్రిమెంట్ దాఖలా భవానీపురంలోని పున్నమీ ఘాట్ నుండి, గుంటూరు జిల్లాలోని వెంకటాయపాలెం వరకు మాత్రమే నడుపుకునేందుకు అనుమతి ఉన్నది. కాని వెంకటాయపాలెం గ్రామస్థులు తమ రేవుకు టూరిజం బోట్లు రావడాన్ని నిరసిస్తూ అడ్డుకోవడంతో గెదెల శ్రీను సంస్థకు సంబంధించిన బోట్లను అడ్డుకోవడం జరిగింది. ఇదే అదనుగా గెదెల శ్రీను వగైరాల బోట్లను తమకు ఇష్టం వచ్చిన రీతిలో పవిత్ర సంగమం వరకు అనుమతి లేకుండా బోట్లను నడుపుతున్నారు.

ఇందులో భాగంగా ది.12.11.2017న మధ్యాహ్నం సమయంలో శేషగిరిరావు, విజయసారథిలు కలసి 25 మంది సామర్థ్యం గల ఇంజను బోటును దుర్గా ఘాట్ జట్టీ వద్ద నిలుపగా, అందుకు టూరిజం శాఖ వారు దుర్గా ఘాట్‌లో నిలిపే అనుమతి లేదని సంబంధిత బోటను అక్కడి నుండి పంపించి వేశారు. అప్పుడు ఆ బోటుతో బెరంపార్క్ నుండి పవిత్ర సంగమం వరకు ట్రయల్ రన్ చేసి, సాయంత్రం సుమారు 4 గం॥ల సమయంలో 25 మంది టూరిస్ట్‌లకు బదులు పడవనడిపే వారితో కలిపి 44 మందిని బోటులో ఎక్కించుకుని పవిత్ర సంగమం వరకు బయలుదేరారు. ఫెర్రీ వద్ద బోటు అదుపుతప్పి బోల్తాపడగా అందులోని 20 మందిని చుట్టు ప్రక్కల ఉన్న పల్లెకారులు మరియు ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలు రక్షించగా మిగిలిన 21 మంది నీటిలో మునిగి మృతి చెందారు. ఇందులో బోటును నడిపిన ముగ్గురు వ్యక్తులు తప్పించుకోవడం జరిగింది.

అత్యంత విషాదకర ఈ ప్రమాద సంఘటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విజయవాడ నగర పోలీస్ శాఖ ఈ కేసులో నిందితులు తప్పించుకోకుండా ఉండేందుకు పలు కోణాల్లో దర్యాప్తు జరిపి బోటు పరిమితికి మించి పర్యాటకులను ఎక్కించి నందుకు ప్రమాదం జరిగినప్పుడు పర్యాటకులను కాపాడే లైఫ్ బయాస్ మరియు లైఫ్ జాకెట్‌లను ఏర్పాడు చేయకుండా పడవను లైసెన్స్‌లేని ఒక వ్యక్తితో నడిపించి 21 మంది నిండు ప్రాణాలను బలిఅవ్వడానికి కారణం అయిన 1) శేషం మోదా కొండలరావు, 2) నీలం శేషగిరిరావు, 3) మాచవరపు మనోజ్‌కుమార్ అలియాస్ చిట్టి, 4) వింజమూరి విజయసారథి, 5) గెదెల శ్రీను మరియు 6) బోటును నడిపిన వ్యక్తులో ఒకరైన భైరవ స్వామిని 7) గేదెల లక్ష్మిని ఈ రోజు అరెస్ట్ చేయడం జరిగింది.

అనుమతి లేకుండా మరియు పరిమితికి మించి పర్యాటకులను తమ లాభాపేక్షకోసం, బోటుపై ఎక్కించి, 21 మంది నిండు ప్రాణాల్ని బలికొన్నారు, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినా ఏ ఒక్కరినీ ఉపేక్షించడం లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఈ ప్రకటన ద్వారా హెచ్చరించడం జరుగుతుంది.

-- xx --